# నాయరికం

రచన: శ్రీ. ముట్నూరు సంగమేశం

[పల్లెటూరిలోని వ్యక్తుల కక్షలు, స్పర్ధలు ఎంతటి విపరీతంగా సాగుతుంటాయో యీ రచన అందజేస్తోంది. పల్లెలో ఐకమత్యం కుదిరిననాడు భారత దేశం దిట్టంగా వుంటుంది. పల్లె ప్రజలంతా స్పర్ధలు లేకుండా జీవితాలను గడపాలనే నీతిని బోధిస్తోంది కథ]

అతడి పేరు చెబితే ఆవూళ్లో పిట్టలు నీళ్లు త్రాగవు. అతడు కచేరీసావిట్లో కూర్చొని వున్నప్పుడు ఆ వీధంట ఏ క్రొత్త కోడళ్ళుగాని, పడుచు పిల్లలుగాని నీళ్ళు తేవడానికైనా పోరు. యౌవ్వనంలో వున్న యువకు డెవరూ అతని కెదురు పడకూడదు. అతడు మాటాడుతూ వున్నప్పుడు, దేవుడైనాసరే, ఆ వూళ్ళో వినవలసిందేగాని ఎదురు చెప్పడానికి వీల్లేదు. అలాంటిహయాం అతడిది.

అతడావూరి నాయుడు. కాస్తో కూస్తో ఆస్తిపరుడు. భగవంతుడిచ్చిన భుజబలం, ప్రభుత్వమిచ్చిన వుద్యోగబలం, తను ప్రోగుచేసుకొన్న పశుబలం అతనికున్నాయి. పేరు, వెంకయ్యనాయుడు. వయస్సు దాదాపు ఏభై వుంటుంది. కండలు దిరిగిన జబ్బలు, మెలికలు దిరిగిన బొద్దు మీసం, ఖణేలుమనే గొంతుక, కంటగింపుగా నే చూపూ, అతడి ప్రాభవానికి దోహదాలు.

అతడికీ మున్సబీ వచ్చింది లగాయితూ పలుకుబడితోపాటు ఆస్తి, ఆస్తితోపాటు అన్యాయం, అన్యాయంతోపాటు అమానుషత్వం, వచ్చాయి. అతడేదైనా కోరేడూ అంటే అది తీరవలసిందే. అనుకున్నాడు అంటే అది జరగవలసిందే.

ఆ రోజు వెంకయ్యనాయుడు రుద్రావతారం దాల్చి కూర్చున్నాడు సావిట్లో. వురుములురిమినట్లు కసురుతున్నాడు యిరస్తా పరస్తావున్న వాళ్ళందర్నీని. ఎందుకీ కోపం అని అడగడానికి ఆ వూరి పొలిమేర వ్యాపించి వున్నంత మేరలో ఏ పురుగుకీ అధికారంలేదు. గ్రుడ్లురుముతున్నాడు. కొండ్రిస్తున్నాడు. కాలు నేలరాసి రంకెలు వేశేస్తున్నాడు. "ఏం పోగాలం!యీ ఎధవకి. గుడ్డుపోయి పిల్ల వెక్కిరించిందట. నలిపేత్తా వెధవరానీ అంటున్నాడు. ఏ పాపాత్ముడు నోచుకున్నాడో యీ కోపాన్ని.

బారికగురివాయ వెంటబెట్టుకో వచ్చాడు రామన్న కాపుని. జంకుతూ జంకుతూ, లోపలి భయాన్ని కళ్ళల్లో నింపుకుంటూ, పదివేల దేవుళ్ళకి మ్రొక్కుకుంటూ; ఏపాపము యెరగనిదీ యీప్రొద్దె పాడుమొగం చూసేనో భగవంతుడా' అని అనుకుంటూ 'యీపొద్దు మాపాట్లెల్లా వున్నాయో దేవుడా' అని దిగులుపడుతూ బుర్రకందుకొని బారిక వెనుకనే వస్తున్నాడు రామన్నకాపు. దూరంనుంచీ దండంబెట్టి మరీ తనవినయాన్ని ప్రకటించాడు కాపు.

"ఏం రామన్నా, భూమ్మీదుండాలనే లేదేటి? మామీది కెదురుతిరిగి నెగ్గించుకోగలవా? మరిచిపోనావా? మొన్నతడాఖా?" అన్నాడు వెంకయ్యనాయుడు.

"ఏటి నాయుడుగారు, మాకేం పోగాలమా, మా మీకెదురు తిరగడం ఓటా. ఇదేతేనాకర్దా" అన్నాడు రామన్నకాపు.

మరేటీపని మావోడు చేసింది? ఏటీ నక్క వినయాలురామన్నా! నాదగ్గర తందనాలు? మజా చూపించాలేటి?" అన్నాడు నాయుడు.

ఈమాటతో కొంచెం అర్థం అయింది రామన్నకీ కోపకారణం. రామన్న కొడుకు సింహాద్రి ఏదో నాయుడికి వ్యతిరేకించి ఉండాలి. అదీ యీ కోపం.

"బాబూగుంట నాకొడుకేదో చేత్తె మీ నాటి పెభువులాగ్రహించాలా! పిలిపించి తగిన బుద్ధిసెప్తే కాదంటామా!" అన్నాడు రామన్న.

"అదెక్కడ గుంటరోయ్. ఆడుమాకింటాడా ఆడికేమయి కన్ను మిన్ను కన్నొత్తుందా! ఇదుగో అఖరిమాట రావన్నా యిను. నువ్వేదో బుద్ధిచెప్పి అణ్ణితోవకి తెచ్చావాసరి. లేకపోతే మరినూడు" అన్నాడు వెంకయ్యనాయుడు.

ఇంతకీ సింహాద్రి చేసినతప్పేమిటో రామన్నకీ మాటల్లో తెలియదు, అడిగితే ఏంకోపం వస్తుందో అని అనుమానం. కాక పెద్ద వాళ్లతో యీ గుంట నాగమ్మకీ పట్టింపు లెందుకూ అని కొడుకుమీదే అతడికికూడా విసుగేసింది. కాని తనకొడుకు తనకి వినడు. ఆ అనుమానం అతడికి బాగా ఉంది. సింహాద్రీ కాలంలో ఉన్నవాడు. ముద్దుగా పెరిగాడు. అతడికెవరి దగ్గరా భయంలేదు. కాంగ్రెసంటే యిష్టం అతడికింటో పూచీలేదు. కష్టసుఖాలు ఎరగని కసుగాయ పట్నంవెళ్ళి క్రొత్త క్రొత్త సంగతులు నేర్చుకొనివస్తూన్న వ్యక్తి. ఊళ్ళో ఉన్న కాపులందరినీ రావిచెట్టుక్రింద కూర్చోబెట్టి గాంధికబుర్లు చెప్పడం అతడికిసరదా. అతడికి తెలిసింది తక్కువేఅయినా తెలుసుననుకోవడం ఎక్కువ. అతడిమీద ఊళ్ళో కొందరికి గౌరవం ఉన్నమాట నిజం.

"అయితే, ఆడుసేసిన తప్పుకి తమరు పట్టుంపులోపట్టాలా బాబూ, ఏదో కుర్రతరహా వోళ్ళు గదా. మీకాడికంపుతాను. బుద్ధిచెప్పి పంపండి" అంటూ రామన్న వెనక్కి మళ్ళేడు.

"అక్కర్లేదు. ఆ వెధవిటు రానేవొద్దు. ఆడి ముఖంచూత్తే నాకగ్గెత్తి నట్టవుద్ది." అని కేక వేశాడు నాయుడు. వెనక్కి వేసిన అడుగు ఒక్కసారి నిల్చిపోయింది రామన్నకి. గుండెలో దడపుట్టినట్టయింది యీ కేకవినేసరికి. ఇదేదో ఉపద్రవం వచ్చినట్టుందనుకున్నాడు.

రావణాసురుడులాటి నాయుడుతో యీ గుంటడికేటీ పేచీలనుక్కని కుందిపోయాడు. సమయం లభిస్తే చంపించెయ్యడానికైనా వెనుదీయని రాక్షసుడీ వెంకన్న. అధికార్లంతా అతనికి దాసోహమే. ఏం బుద్ధి పరమేశ్వరా, అసలు యీతగువు ఎందుకొచ్చినట్టు. ఇది తిన్నబడి గుండె కెదుటపడుతుందా అనే ఆలోచనలతో క్రుంగిపోతూంది. వాలుగా యిల్లు చేరాడు రామన్నకాపు.

వీధి అరుగుమీదే కూర్చున్నాడు సింహాద్రి. కొడుకును చూడగానే రామన్నకి కోపం, దుఃఖం, అసహ్యమూ, భయమూ అన్నీ వచ్చాయి.

"తిని తిరగడంసాలకీ తగువులేట్టి సింవ్వాద్రి. నాయుడగ్గయి పోతువ్వాడుగదా, ఆడితో తవ్వాయి తెచ్చుకొని యిక్కడ బతకడం ఎల్లాగన్న గ్యాసం ఒద్దా యిరవైయేళ్ళొచ్చి. ఎవురికంటె గొప్పోళ్ళం. పెద్దపెద్ద వుద్యోగస్తులే ఆడిమాట గీటుదాటరుగదా" అని ప్రారంభించేడు కొడుకుతో.

"ఏటి! రాజ్యం ఈ ముండేల్తుందేటి? నాకేటి భయం నాయుడిదగ్గర. చూజూస్తూ ఆడి అన్నాయం పెరిగిపోతూంటే యెట్టావూరుకోను' అన్నాడు సింహాద్రి.

"అన్నాయమో, నాయమో, యెవురికీ లేని బాధ మనకేనేటి? అసలు యీ తగులేటి చెప్పమా" అన్నాడు రామన్నకాపు కొడుకుతో.

"తగులేటి? నాయుడికి మామ్ముళ్లు యివ్వొద్దని నేను మొన్న రాయిచెట్టుకాడ అన్నాను నలుగురితోటీని. అదీయీబాధ! ఎందుకియ్యాలితేరగా ఈ యెదువకి" అన్నాడు సింహాద్రి.

రామన్నకి నవ్వొచ్చింది. కుర్రాడికి తెలివి తక్కువ అనుకున్నాడు. అనుభవించాలని మాట అని విసుక్కున్నాడు.

"మామూళ్ళెనాడు పుట్టాయా? కాక, మామూళ్ళీయందీ మనపనిసరిగ్గా జరుగుద్దా యేమన్నా నా!

యెందుకీ సాదనీకు?" అన్నాడు లేచిపోతూనూ రామన్న.

"ఎందుకియ్యాలా! వల్లకాదు. యీసారి యెవుళ్ళిచ్చినా అడుపుచ్చుకున్నా నేను పట్టంలో రిపోట్టరిత్తాను." అన్నాడు సింహాద్రి.

వెళిపోతూన్న రామన్న నిలబడ్డారు "నీ రిపోర్టెవడు నూత్తాడ్రా ఎర్రిమొకమా! అంతా ఆడి మాటే ఆడతారుగాని" అన్నాడు.

"చూద్దాంలే" అన్నాడు సింహాద్రి లేచిపోతూనూ. కొడుకు వినేట్టులేదని రామన్న భయపడ్డాడు. ఈపనిలో యెలాగైనా నెగ్గాలని సింహాద్రి పట్టుబట్టేడు. పెంటమీగ్గి వంటిమీదపోసుకునే కొడుకునీ, ఈగవాత్తే దుడ్డట్టుకొనే నాయుణ్ణీ తలచుకొని బెంబేరెత్తిపోయాడు రామన్న కాపు. కొంపకేదో వినాశకాలం వచ్చిందనుకున్నాడు. కొడుకునొక్క లెంపకాయ కొడితేనో! తిరగబడతాడేమో! అతడికంతా అయోమయం అయింది.

ఆరోజునుంచి విధిగా రావిచెట్టుదగ్గర సింహాద్రి మకాం వేసి మరీచెపుతున్నాడు నలుగురితోటినీ నాయుడుమీద పోటీలు. నాయుడు చేసిన అన్యాయాలన్నీ ఏకరువు పెడుతున్నాడు. మనం ఊరుకుంటే లాభం లేదంటున్నాడు. తిరగబడితేనే కాని యీ అన్యాయం పోదని చాటుతున్నాడు. అందరిచేతనూ ఔనని ఒప్పిస్తున్నాడు.

సింహాద్రిది ఉడుకురక్తం. అతని హృదయం అన్యాయాన్ని సహించదు. అతనికితోడు ఆయీడు వాళ్ళే మరో నలుగురు కాపు యువకులు కూడేరు. వీరంతా ఒబలగం నాయుడుచేసే ప్రతీపనీ వీళ్లుపసిగట్టి వున్నదున్నట్టు బయటపెడుతున్నారు. ఊళ్లో అలజడి బయలుదేరింది. నాయుడికి నిద్రపట్టలేదు. సింహాద్రిపేరు అతనికి సింహస్వప్నం అయింది.

అన్యాయంగా నాయుడుచేతిలో నలిగిపోయిన వాళ్లు కోడళ్ళమానాలు కోల్పోయినవాళ్లు, కూతుళ్ల మనువులు కూలిపోయినవాళ్ళు, భూములు ఏలాం అయిపోయినవాళ్లు అనేకులు ఆవూళ్లోవున్నారు. ఆసరాలేక అణగార్చుకొన్న వాళ్ళకోపానికి, కడుపుమంటలకీ, అసమాన దుఃఖానికీ సింహాద్రి మాటలు దోహదాలయ్యాయి. వాళ్ళంతా నాయుడికి వ్యతిరేకించడానికి సిద్ధంఅయ్యేడు.

నానాటి సింహాద్రి పార్టియితోధికం అవుతూ వుంటే నాయుడు చూడలేకపోయాడు. అతనికి వళ్ళంతా మంటపట్టుకుంది. సింహాద్రిని ఈవూళ్లోంచి తగిలేస్తేగాని యీ వుపద్రవం కట్టేలాక్కనబడలేదు అతనికి. ఏదో పన్నుగడపన్ని యిల్లు, పొలమూ, ఏలం వేయించి ఏఆస్కారం లేకుండాచేసి, సకుటుంబంగా వాణ్ణీ వూరినుంచి తగిలెయ్యాలని దీర్ఘాలోచన వేశాడు వెంకయ్య నాయుడు.

కరణం అప్పారావు సలహాదారు. వ్రాతగాడు. ఊళ్లోపద్దు, పరక, నోటు, క్రయచీటీ అన్నీ అతని దస్తూరిమీద జరగాలి. వెంకయ్య నాయుడికీ కరణానికి దోస్తీయెక్కువ. ఇద్దరూ ఆలోచించి ఓదొంగనోటు సృష్టించేరు రామన్న పేరిట. ఆనోటుమీద పట్నంలో దావాపడేశారు. రామన్నకి, కొడుకు సింహాద్రికీకూడా సమ్మను వచ్చాయి.

అనుకోకుండా వచ్చిన ఆపదకి రామన్న దద్దరిల్లిపోయాడు. ఏపాపం యెరగని తనమీద యీ పిట్టపిడుగు భగవంతుడేమని వేశాడో అనియేడ్చాడు. కొడుకే యీపాట్లన్నిటికి కారణంఅని వాపోయాడు సింహాద్రిని పదితిట్టి, తనో పదితిట్టుగొన్నాడు. సాగి సంతకాలు పెట్టినవాళ్ళ యింటికిపోయి అఘోరించాడు. కరణంగారి కాళ్లావేళ్లాపడి కన్నీళ్లు గార్చాడు. నాయుడ్ని ప్రాధేయబడ్డాడు. తన దుర్దినాలనుకున్నాడు. దైవాన్ని దూషించేడు.

సింహాద్రికి వళ్లు మండిపోయింది యీ కబురుతోటి. ఊళ్లో అందరితోటీ 'యిది అన్యాయం' అని చాటేడు. వెంకయ్యనాయుడ్ని నరికేస్తానని బయల్దే

రాడు. నీ తెలివితక్కువే యింత పెట్టిందని తండ్రిని నిందించేడు. కరణాన్ని ముఖాముఖి యెదిరించి మొఖం వాచిపోయేలా చీవాట్లేశాడు. నలుగుర్ని న్నాడు. నాలుగు తిన్నాడు.

ఊళ్ళో అందరికీ ఇది కంటకంగానే తోచింది. రామన్న సంసారం అంతా యెరిగిందే. అతడెన్నడూ అప్పుతెచ్చి యెరగడు. సింహాద్రిమీద నాయుడికి కోపంగా వుందన్న సంగతికూడా వూరంతా యెరిగిన విషయమే. ప్రతీమనిషికి ఇందులోవున్న సత్యం కళ్లకి కట్టినట్టు కన్పించిపోయింది. అయితేనేం, గట్టిగా అనడానికే ఎవడికీ ధైర్యంచాలదు. 'బలవద్విరోధం మనకెందుక'ని కొందరూ, 'నాయుడు దుర్మార్గుడురా మన్నేంచేస్తాడో రేపు' అని కొందరూ, 'లోకమో పాడో భగవంతుడే చూస్తాడు. మన వల్లయ్యేదేమి'టని కొందరూ తటస్థంగావుండి చూచే వాళ్లేగాని యిది అన్యాయమనిగాని, యిది దొంగ నోటనిగాని బహిరంగంగా రామన్నపక్షాన్న సాక్షీ చెప్పేవాళ్ళెవళ్లూ లేరు. అందరికీ నిజం తెలుసు. పైకి చెప్పడానికందరికీ జంకుగానేవుంది. నాయుడు హయాం అలాంటిది. అతని నాయరికం అంటే రావణాసురుడేటండి. అతడికెదురు నిలచి పరువు, మర్యాదా, ప్రాణం నిలబెట్టుకోవటం ఆ వూళ్ళో అసాధ్యం. అది వాళ్ళభయం.

సాక్షులుమాత్రం లోపల అనుమానించేరు. పిల్లాపాపలున్నవాళ్ళం. ఈ అన్యాయం మననిబాగు చేస్తుందాఅని కాని నాయుడుదగ్గర భయంకొద్దీ వాళ్లు సిద్ధపడక తప్పిందికాదు అన్యాయానికి.

ఆరోజు వాయిదా. పాపం కన్నీళ్ళతో త్రోవల్లా తడుపుతూ రామన్న పట్నం వెళ్లాడు. సింహాద్రి నలుగురు స్నేహితులుకూడా వెళ్లాడు. ఇది అన్యాయమని వాదిద్దామని వాళ్ళ నిశ్చయం. ఇది సాగదు అని రామన్న నమ్మకం.

మహా ఉత్సాహంతో క్రొత్తగాకొన్న కోడెల జత పూసిన బండిమీద పట్నం బయలుదేరాడు వెంకయ్యనాయుడు. కరణంకూడా ఆ బండిలో వున్నాడు. వెంకయ్య ఆనందం కోడెలకికూడా వున్నది కాబోలు అవి మహా వేగంతో పరుగెడుతున్నాయి. అతనిముఖం విప్పారివుంది. ఈరోజుతో సింహాద్రి నశించాడని ముమ్మారనుకున్నాడు నాయుడు. చూడు నా తమాషాఅని ఆనందించేడు.

హఠాత్తుగా బండి గొడుగుపాటు పడింది. కోడెలు పరిగెట్టి పల్లంలోకి దింపేశాయి బండిని. బండి యిరుసు ఫట్‌మని విరిగింది. వెంకయ్యనాయుడు బండిలోంచి తుళ్ళిపోయి ప్రక్కనున్న మడిలో స్పృహతప్పి పడ్డాడు. అతనికి నడుముమీద బలమైనదెబ్బ తగిలింది. కరణానికి చెయ్యి విరిగింది.

డోలీమీద ఆస్పత్రికివచ్చి తెలివి వచ్చిన వెంకయ్యనాయుడు సింహాద్రిని పిలిచి క్షమాపణతో సహా రాజీ మాట్లాడుతున్నాడు.

---

## నిర్మల
## ఎడబాటు

ఈ రెండు నవలలను శ్రీ కె. వి. అప్పలాచార్య రచించారు. వెల ఒక్కొక్కటి ఆరేసి అణాలు. ప్రతులకు శ్రీ వెంకటేశ్వర పబ్లిషింగ్ హౌసు, రాజమండ్రి కి వ్రాయాలి. ఈ రెండు గ్రంథాలు రైల్వే సారస్వత మాలకు క్రొత్త హారాలు, ఆ నవలలో నడిచే అసహజధోరణి, చిలిపితనం, కథాశిల్పలోపం ఈరెండునవలలోనూ కనిపిస్తున్నాయి. ఈలాంటి రచనలు ప్రజలికి, సారస్వతానికీ ఎలాంటి సేవనూ చేయక పోవడంఅటుంచి రచయితకే కథకలోకంలో మంచిస్థానం దొరకదు.